సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలో చేరికలు

మైదుకూరు పట్టణంలోని 22వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి 80 కుటుంబాలవారు వైఎస్సార్‌సీపీలో చేరారు. -8లో



యువకుడి దుర్మరణం

ట్రాక్టర్ అదుపు తప్పి కింద పడిన నంఘటనలో ఇమాం బాష (34) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన వద్దిరాల గ్రామ శివార్లలో నెలకొంది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
42.6/27.4

వాతావరణం

జిల్లాలో బుధవారం 27.4 - 42.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

కడప అగ్రికల్చర్: జిల్లాలో మళ్లీ ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఐదు రోజుల క్రితం జిల్లాలో 39.6 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రతలు బుధవారం నాటికి 42.6 డిగ్రీలకు చేరుకున్నాయి. దీనికితోడు ఎండ తీవ్రతతోపాటు ఉక్కపోత అధికంగా ఉండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలో ఆదివారం 39.5 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా సోమవారం 40.4 డిగ్రీలకు చేరింది. మంగళవారం 41.6 డిగ్రీలు ఉండగా బుధవారం నాటికి 42.6 డిగ్రీలు నమోదైంది. క్రమేపీ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో జనం ఆందోళన చెందుతున్నారు.

గండి అంజన్న సన్నిధిలో...



వైభవంగా ఊరేగుతున్న గండి వీరాంజనేయుడు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆలయ సహాయ కమీషనర్ అలవలపాటి ముకుందరెడ్డి,చైర్మెన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్, రాజగోపాలా చార్యులు,వేదపారాయణం రామమోహణశర్మలు స్వామి వారిని ప్రత్యే కంగా అలంకరించిచారు. రాత్రి ప్రత్యేకం గా అలంకరించిన రథంలో ఉన్న ఉష్ణ వాహణంపై అంజన్న ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కల్యాణోత్సవ ఏర్పాట్ల పరిశీలన



కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, జేసీ గణేష్ కుమార్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏప్రిల్ 22న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం రోజున భక్తుల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లను టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌లు బుధవారం పరిశీలించారు. వైఎస్సార్ జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని పోలీసులు, టీటీడీ విజిలెన్సు సిబ్బంది పటిష్ట బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్, భక్తుల అవసరాలకు తగినన్ని ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, అన్నప్రసాద కౌంటర్లు, లైటింగ్, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు, అదనపు పారిశుధ్య సిబ్బంది తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ కుమార్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, వీజీఓ బాలిరెడ్డి, డిప్యూటీ ఈఓలు నటేష్ బాబు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ధ్వజారోహణం

ఒంటిమిట్టలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో బుధవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య మిథున లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేఈఓ వీరబ్రహ్మం మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో ప్రధానంగా ఏప్రిల్ 20న హనుమంత వాహనం, ఏప్రిల్ 22న కల్యాణోత్సవం, 23న రథోత్సవం, 25న చక్రస్నానం జరుగుతాయన్నారు. ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, వీజీఓ బాలిరెడ్డి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

శేషవాహనంపై శ్రీ సీతారామలక్ష్మణుల అభయం

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజైన బుధవారం రాత్రి శేషవాహనంపై సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారు భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 గంటల నుంచి భజన బృందాల కోలాటాల నడుమ పురవీధుల్లో వాహనసేవ జరిగింది..కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీరాముడు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు

కవి సమ్మేళనం

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం బమ్మెర పోతన జన్మదినాన్ని పురస్కరించుకొని కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామ్ అధికారి రాజగోపాల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా టీటీడీ దత్సహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో పసుపులేటి శంకర్ పురాణంపైన, నారాయణరెడ్డి భాగవతంలోని గజేంద్రుని ఆక్రందన, డాక్టర్ నీలవేణి రంతి దేవుని చరిత్ర, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి భాస్కర రామాయణంలోని శివ ధనుర్భంగం, సీత స్వయంవరంపై, ఎం.శివారెడ్డి కుచేలోపాఖ్యానంపైన కవిత్వాన్ని చెప్పారు.

తలంబ్రాల తయారీ ప్రారంభం: శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 22న జరగనున్న సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో బుధవారం తలంబ్రాల ప్యాకింగ్‌ను జేఈఓ వీరబ్రహ్మం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈఓ మాట్లాడుతూ ముత్యాల తలంబ్రాల ప్యాకింగ్ కార్యక్రమం శ్రీవారి సేవకులతో ప్రారంభించినట్లు తెలిపారు. తలంబ్రాలకు ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్ద గల పీఏసీ వద్దకు తీసుకువచ్చారు. శ్రీ సీతారామ కల్యాణం తలంబ్రాలలో పసుపు వినియోగించేందుకు ఏప్రిల్ 13న పసుపు దంచే కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇక్కడి హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భక్తులకు సేవలందించేందుకు కర్నూలు, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి శ్రీవారి సేవకులు వచ్చినట్లు ఆయన తెలిపారు. దాదాపు 300 మంది శ్రీవారి సేవకులు 1.20 లక్షల తలంబ్రాల ప్యాకెట్లను తయారు చేస్తున్నట్లు వివరించారు.

రుచికరమైన అన్నప్రసాదాలు

శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు విశేషంగా హాజరయ్యే వేలాది మంది భక్తులకు నిరంతరాయంగా రుచికరమైన అన్నప్రసాదాలను టీటీడీ అందిస్తోంది. అలాగే తాగునీరు, మజ్జిగ అందించనున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎండ వేడిమి నుంచి భక్తులకు ఇబ్బంది లేకుండా జర్మన్ షెడ్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం 7 గంటలకు అల్పాహారం, 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిరిగి సాయంత్రం 6.30 గంటల నుంచి 7 గంటల వరకు రుచికరమైన అన్నం, సాంబారు, రసం, మజ్జిగ, పచ్చడి, కూరలు, బెల్లం పొంగలి అందజేయనున్నారు.

రామయ్యను దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ముమ్మూర్తులను రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు

▶▶ బ్రహ్మోత్సవాలలో నేడు

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 7.30 గంటలకు వేణుగానాలంకారణల దాశరథి దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 గంటలకు హంస వాహనంపై స్వామివారు విహరిస్తారు.

నామినేషన్లకు వేళాయె

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు
- ఆర్వో కార్యాలయాల వద్ద డీఎస్పీ ర్యాంకు నోడల్ అధికారి
- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ కౌశల్



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు, చిత్రంలో ఎస్పీ సిద్దార్థ కౌశల్

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టానికి తెర లేవనుంది. గురువారం నుంచి నామినేషన్ల పర్వం మొదలు కానుంది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ కౌశల్ బుధవారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం భారత ఎన్నికల సంఘం విడుదల చేస్తుందని, ఆ తర్వాత తాను జిల్లాలోని రిటర్నింగ్ అధికారులందరికీ పబ్లిక్ నోటీసు జారీచేస్తానన్నారు. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఈనెల 25వ తేది వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. కడప పార్లమెంటు స్థానానికి తాను రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తానని, లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థులు తమ చాంబర్‌కు వచ్చి నామినేషన్ పత్రాలు సమర్పించాలన్నారు. ఇక బద్వేలు, కడప, పులివెందుల, జమ్మలమడుగు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఆయా ఆర్డీఓ కార్యాలయాలలో నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

26న పరిశీలన...29 వరకు ఉపసంహరణ

ఈనెల 26వ తేది నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, అదేరోజు నుంచి ఈనెల 29వ తేది వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహిస్తామని వివరించారు. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలతోపాటు ఫారం–26 డిక్లరేషన్ కింద ఆస్తులు, విద్యార్హతలు, కేసులు వంటి వివరాలు సమర్పించాలన్నారు. ఒక నియోజకవర్గానికి చెందిన వారు మరో నియోజకవర్గంలో పోటీ చేయాలనుకున్నప్పుడు ఓటర్ల జాబితా సర్టిఫైడ్ కాపీ సమర్పించాలన్నారు. సువిధ.ఈసీఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్ దాఖలు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫైనల్ కాదని స్పష్టం చేశారు. దాని ప్రింట్ అవుట్ తీసుకుని వ్యక్తిగతంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆర్వో ఎదుట ప్రతిజ్ఞ చేయాల్సి ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయానికి ఫారం–ఏ, ఫారం–బి సమర్పించకపోయినా స్క్రూటినీ సమయానికి ఖచ్చితంగా సమర్పించాలన్నారు. అభ్యర్థులు ప్రత్యేకంగా బ్యాంకు అకౌంటు ఏర్పాటు చేసుకోవాలని వెల్లడించారు. నామినేషన్ వేసినప్పటి నుంచి ఖర్చులు అభ్యర్థి ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. లోక్‌సభ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ. 25 వేలు, అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు రూ. 10 వేలు చెల్లించాలన్నారు. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు అందులో సగం చెల్లిస్తే సరిపోతుందన్నారు. డిపాజిట్ మొత్తం నగదుగా గానీ, చలానాగానీ సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేయవచ్చన్నారు. చెక్కుల మాత్రం స్వీకరించబడవని స్పష్టం చేశారు.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ సిద్దార్థ కౌశల్

నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా అన్ని రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. ఆర్వో కార్యాలయ వంద మీటర్ల పరిధిలోకి అభ్యర్థులకు చెందిన మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తామని వివరించారు. ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల అవతల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ మామూలుగానే అమలులో ఉంటుందన్నారు. నామినేషన్లు వేసే సమయంలో అభ్యర్థి, ఆయన వెంట నలుగురు వ్యక్తులను మాత్రమే ఆర్వో చాంబర్‌లోకి అనుమతిస్తామన్నారు. ప్రతి ఆర్వో కార్యాలయం వద్ద డీఎస్పీ స్థాయి నోడల్ అధికారులను నియమించామన్నారు. అభ్యర్థులు నోడల్ అధికారులతో సంప్రదించి సహకరించాలన్నారు. ఈసీఐ మార్గదర్శకాలు పాటించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

▶▶ ముఖ్యమైన తేదీలు

- నామినేషన్ల ప్రారంభం: **18**
- నామినేషన్లకు గడువు: **25**
- నామినేషన్ల పరిశీలన: **26**
- ఉపసంహరణకు గడువు: **29**
- పోలింగ్ : మే **13**
- కౌంటింగ్: జూన్ **4**

▶▶ జిల్లాకు ఎన్నికల వ్యయ పరిశీలకులు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి పర్యవేక్షణ నిమిత్తం వ్యయ పరిశీలకులు బుధవారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. కడప పార్లమెంటరీ నియోజకవర్గానికి 2013 బ్యాచ్‌కు చెందిన రమేష్ భారతి, బద్వేలు కడప, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాలకు 2014 బ్యాచ్‌కు చెందిన సత్యేంద్ర సింగ్ మెహరా, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు మైదుకూరు నియోజకవర్గాలకు 2015బ్యాచ్‌కు చెందిన రాజేష్ కుమార్ మీనా జిల్లాకు వచ్చారని కలెక్టర్ వివరించారు.

▶▶ నిబంధనలు పాటించాలి

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు దాఖలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు గానీ, వారి ప్రతిపాదకులు గానీ నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎన్నికల కమీషన్ సూచించిన నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ఎంసీసీ ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ టీం, వ్యయ పరిశీలన తదితర టీములు జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షిస్తున్నాయన్నారు. అలాగే షాడో టీమ్స్ నిరంతర నిఘా ఉంటుందన్నారు. సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ పారదర్శకంగా జరుగుతుందన్నారు. జిల్లాలోని మొత్తం 2035 పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసులతోపాటు ఎన్‌సీసీ, స్కౌట్ గైడ్ ల సేవలను వినియోగించుకుంటామన్నారు. గుర్తించిన 527 క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక ఫోర్స్ భద్రతతోపాటు వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సచివాలయ వలంటీర్ల సేవలను ఎక్కడ వినియోగించడం లేదన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కూడా ప్రభుత్వ ఉద్యోగులైన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా ఆయా సచివాలయాల్లోనే పంపిణీ చేస్తున్నామన్నారు. ఈవీఎంలు జిల్లాకు సరిపడా సిద్ధంగా ఉన్నాయన్నారు. మే మొదటి వారంలో పీఓ, ఏపీఓలకు రెండవ విడత ట్రైనింగ్ ఇస్తామన్నారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది ఇప్పటివరకు 1200 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం నమోదు చేసుకున్నారని, ఈ నెల 25లోపు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు. ఇతర జిల్లాల్లో ఉన్నవారి జాబితా కూడా పోస్టల్ బ్యాలెట్ కోసం సేకరిస్తున్నామన్నారు. మే నెల 1–5 లోపు ఓటరు స్లిప్పుల పంపిణీ కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో బి.హరిప్రసాద్(తెదేపా), కానుగ దానం (బీఎస్పీ), జి. లక్ష్మణ్ రావు (బిజెపి), బి.పాల్ సుధాకర్ (కాంగ్రెస్), ఎం.భరత్ రెడ్డి (వైఎస్ఆర్ సిపి), శ్రీనివాసులు, తిరుమల్ రెడ్డి(ఆప్) మనోహర్ (సీపీఐఎం) పాల్గొన్నారు.



రాములోరిని దర్శించుకుంటున్న భక్తులు

కమనీయం.. రాములోరి కల్యాణం

- జిల్లా అంతటా నవమి వేడుకలు
- కనుల పండువగా సీతారాముల కల్యాణాలు



కడప బాలాజీనగర్‌లోని రామాలయంలో కల్యాణమూర్తులుగా సీతారాముల వారు

కడప కల్చరల్: నీలి మేఘాలన్నీ శ్రీరాముని రూపుదాల్చాయి. సూర్యకాంతులన్నీ సీతమ్మ రూపాన్ని సంతరించుకున్నాయి. ప్రకృతి పరవశించి ఆ సమ్మోహన రూపాలను ఆనందంగా తిలకిస్తున్నాయి. ఆ ఆదర్శ మూర్తుల కల్యాణోత్సవాన్ని తిలకిస్తూ సంబరపడ్డాయి. కన్నార్పితే కమనీయమైన ఆ దృశ్యం చూడలేమని భక్తులు ఒళ్లంతా కళ్లు చేసుకుని సీతమ్మ, రామయ్యల కల్యాణాన్ని తిలకించారు. పందిళ్ల కల్యాణానికి గొడుగు పట్టగా, పూలబాలలు మంచి గంధాన్ని అందించాయి. అరటి పిలకలు, మామిడి తోరణాలు శ్యామసుందరుని కల్యాణానికి శోభనిచ్చాయి. హాయి గొలిపే మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య జగన్మాత జానకిని గళసీమలో జగన్నాథుడు శ్రీరామచంద్రుడు మంగళ సూత్రం అలంకరించాడు. ఈ దృశ్యాన్ని తిలకించిన భక్తులంతా తన్మయత్వంతో పులకించారు. జై శ్రీరామ్ అంటూ జిల్లాలోని శ్రీ రామాలయాలు మార్మోగాయి. కల్యాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. బుధవారం శ్రీరామ నవమి సందర్భంగా రామాలయాలలో ఉదయం 5 గంటల నుంచి మూలమూర్తులకు విశేష అభిషేకాలు చేసి కనుల పండువగా అలంకరించారు. 10 గంటల నుంచి కల్యాణాల సందడి ప్రారంభమైంది. దాదాపు ప్రతి ఆలయం వద్ద కల్యాణాలు వైభవోపేతంగా సాగాయి. ప్రత్యేక వేదికలపై కొలువుదీర్చిన రామయ్య, సీతమ్మల ఉత్సవ మూర్తులు నూతన వధూవరులుగా భక్తులను కటాక్షించారు. స్థానిక ప్రముఖులు కల్యాణోత్సవాలకు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని రామాలయాలకు వెళ్లి స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకుని కొన్నిచోట్ల కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. అన్నిచోట్ల భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. అనంతరం అన్ని ప్రముఖ ఆలయాలు, కల్యాణ మూర్తులను రథంపై కొలువు దీర్చి రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

క్లుప్తంగా

వ్యక్తి అరెస్ట్

రామసముద్రం : అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు .. రామసముద్రం మండలం కుదురుచీమనపల్లె పంచాయతీ జోగిండ్లుకు చెందిన పింద్రాళ్ల వెంకటరమణ కర్నాటక రాష్ట్రం నుండి అక్రమంగా (ఒరిజినల్ ఛాయిస్ విస్కీ)192 టెట్రాప్యాకెట్స్ తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. వెంకటరమణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈదాడుల్లో సిబ్బంది గంగిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన స్కూటరిస్టు

పీలేరు రూరల్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. కేవీపల్లె మండలం మద్దిపట్లవారిపల్లెకు చెందిన యల్లయ్య (30) బుధవారం రాత్రి ద్విచక్రవాహనంలో పీలేరునుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద కడప వైపు నుంచి చెన్నై వెళుతున్న టెంపో వాహనం ఎదురుగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మదనపల్లె : కర్నాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యంను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా రాత్రి గస్తీ తిరుగుతుండగా, పట్టణంలోని నెమలినగర్ వద్ద రాయచోటికి చెందిన యస్.గౌస్ మొహియుద్దీన్, ఎస్.మగ్బూల్‌లు, ఏపీ-04 యూ.3617 లారీలో రేషన్‌బియ్యం రాయచోటి నుంచి బెంగళూరుకు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. లారీలో 583 బ్యాగుల్లోని 19,160 కిలోల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసులో మరో ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

కేసు నమోదు

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని చిప్పిలికి చెందిన శివయ్య భార్య వసంత(28) ఈనెల 13 నుంచి ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయిందన్నారు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఆమెకు పదేళ్ల క్రితం వివాహం కాగా, ముగ్గురు పిల్లలున్నట్లు సీఐ చెప్పారు. భర్త శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని 22వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి 80 కుటుంబాలవారు వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక విలియమ్స్ నగర్‌లో తప్పెట పుల్లయ్య, భూమిరెడ్డి యోహాన్, భూమిరెడ్డి రాజు, మార్తమ్మ, ప్రభావతి, లీలావతి, రమణమ్మ, మరియమ్మ, విజయమ్మ, జయమని, విజయ్, సుగుణపాల్, పసల వెంకటయ్య, దాసరిగాండ్ల మాధవయ్య, దాసరిగాండ్ల చిన్న, బి.వెంకటరమణ, ప్రతాప్, నాగేశ్వరరావు, పెద్ద పుల్లయ్య, విజయరావు, సునీల్, చైతన్య, పసల దేవదాసు, సుదర్శనమ్మ, తప్పెట సుధాకర్ తదితర 80 కుటుంబాల వారికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పార్టీ కండువాలను వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తప్పెట పుల్లయ్య తదితరులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తమను ఎంతో ఆకర్షించాయని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు శెట్టిపల్లె అశోక్ రెడ్డి (బాబ్జి), వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, కార్యదర్శి ముజాఫర్, నేట్లపల్లె శివరాం, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న, కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, సొద్దల సురేష్, ఖాదర్, కూశెట్టి రాయుడు, బీఎల్ రఘురామయ్య, రామదాసు, విశ్వనాథ ఆచారి, గోశెట్టి లక్షుమయ్య, గోశెట్టి రామచంద్ర, నాయబ్ రసూల్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

• మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం చాపాడు మండలం సోమాపురం ఎస్సీ కాలనీకి చెందిన 20 కుటుంబాల వారు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమాపురం సర్పంచ్ వై.శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో తిరుపోళ్ల లక్ష్మయ్య, తిరుపోళ్ల భైరవ, తిరుపోళ్ల ఇంద్ర, తిరుపోళ్ల సింహాద్రి, వెదురూరు పీరయ్య, బద్రిపల్లె శ్రీను, తిరుపోళ్ల సుబ్బరాయుడు, కామనూరు అంజన్న, వెదురూరు సునీల్, వెదురూరు బ్రహ్మయ్య, సుబ్బరాయుడు, వారాది బైచంద్ర, వారాది భార్గవ, కామనూరు అంజన్, కామనూరు శ్రీరాములు, వెదురూరు పుల్లయ్య, చాగలమర్రి వెంకటేష్, వెదురూరు సుబ్బరాయుడు తదితర కుటుంబాల వారికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పార్టీ కండువాలను వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకిరెడ్డిపల్లె సుబ్బరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 20 కుటుంబాలు చేరిక

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల కేంద్రమైన ఎర్రగుంట్ల పట్టణంలోని వినాయకనగర్ కాలనీలో నివాసం ఉండే 20 కుటుంబాలు బుధవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలోకి చేరిన వారందరికీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పార్టీ కండవాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుబ్బరాయుడు, ఆంజనేయులతో పాటు ఇతర కుటుంబాలు ఉన్నాయి.

సీఎం వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

• ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి
• వైఎస్సార్‌సీపీలో చేరిన 40 కుటుంబాలు



కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరడం, అలాగే ప్రభుత్వం కులాలు ,మతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తుండడంతో నేడు పార్టీలోకి తండోపతండాలుగా చేరుతున్నారని ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం చెన్నూరు కొత్త రోడ్డు శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన లోమడ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 10 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరందరికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా స్థానిక మైనార్టీ కాలనీలో ఫారుక్ బాబా, అన్వర్ బాష, అబ్దుల్ రబ్, మునీర్ అహ్మద్, వారీస్, సాదిక్ అలీ, హజ్రత్, జుమన్, నూర్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరినవారికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కిట్టు ,చంద్ర, గురయ్య, సాయి, లక్ష్మణ్ రెడ్డి, మౌలాలి, అల్లా బకాష్, ఖాదీర్ గులాం, ముబారక్, అలీ, కవిత, ఖాదర్ బాషా, భాను, రఫీ , మోహిద్దీన్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఆర్‌వీఎస్ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం మైనార్టీ యువకులు

రాజంపేట : నందలూరు, పాటూరుకు చెందిన ముస్లిం మైనార్టీ యువకులు, నేతలు పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలోకి చేరారు. బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సమక్షంలో పార్టీ కండువాలను కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గడికోట వెంకట సుబ్బారెడ్డి, గొబ్బిళ్ల త్రినాథ్, నడివీధి సుధాకర్, మైనార్టీ నేతలు హాల్ మస్తాన్, జావిద్‌అలీ, ఇబ్బు, పాటూరు ఇలియాస్ పాల్గొన్నారు. కండువా కప్పుకున్నవారిలో మక్బుల్, హత్తర్, నయూమ్‌బాష, నజీర్, నియాజ్, షరీఫ్, అజమాట్, అర్షద్, దాదాపీర్, ఇమ్రాన్, రషీద్, అరవపల్లె నియాజ్, అఫ్జల్, ఆరీఫ్, సోయబ్, తార, చందు, గొల్లపల్లె యూత్, పాటూరు అన్వర్‌బాష, మొహమ్మది, ఇక్బాల్, సమీర్, సల్మాన్, వార్డు మెంబర్స్ అఫ్సర్, అమెన్, కరీముల్లా, జాబీర్, కమాల్ బాష, అబ్దుల్, మాజీబ్, సలీం, పాపజి, ఉస్మాన్ ఉన్నారు.

ట్రాక్టర్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన ఇమాంబాష

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ట్రాక్టర్ అదుపు తప్పి కింద పడిన సంఘటనలో ఇమాం బాష (34) అనే వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయిన సంఘటన వద్దిరాల గ్రామ శివార్లలో నెలకొంది. తలమంచిపట్నం ఎస్ఐ హనుమంత్ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం వద్దిరాల గ్రామ శివార్ల నుంచి పాత ఇనుప కడ్డీలను ట్రాక్టర్‌లో వేసుకుని జమ్మలమడుగుకు వస్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పి కిందపడింది. దీంతో ట్రాక్టర్లలో ఉన్న ఇనుప కడ్డీలు ఇమాంబాషపై పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడి భార్య నూర్జహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారిస్తున్నట్లు ఎస్ఐ హనుమంత్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు

మహిళ మృతి



మృతిచెందిన లక్ష్మిదేవి

లింగాల : లింగాల మండలం కోమన్నూతల గ్రామంలో బుధవారం సాయంత్రం ఇంటిలో మంటలు చెలరేగి పెద్దచిన్నన్నగారి లక్ష్మిదేవి (50) అనే మహిళ మృతి చెందింది. ఎస్ఐ కృష్ణయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దచిన్నన్నగారి వెంగల్‌రెడ్డి, లక్ష్మిదేవి దంపతులు. కాగా వీరు గ్రామంలో అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. బుధవారం తన భర్త మోటారు సైకిల్ కోసం తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒక చిన్న బాటిల్‌లోకి ఆమె మారుస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించింది. చిన్న ఇళ్లు కావడంతో ఆ సమయంలో కరెంటు కూడా లేకపోవడంతో దీపం వెలుతురులో పెట్రోల్‌ను చిన్న బాటిల్‌కు మారుస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఆ సమయంలో భర్త ఇంటిలో లేకపోవడంతో మంటలు చెలరేగి ఇంటిలోని సామాగ్రితో పాటు ఆమెకు మంటలు అంటుకుని అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె భర్త వెంగల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన మహిళ మృతి

ముద్దనూరు : మండలంలోని చెన్నారెడ్డిపల్లెకు చెందిన తాటి లక్ష్మిదేవి(58) అనే మహిళ మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు.. లక్ష్మిదేవి గత నెల 23వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మార్చి 25వ తేదీన పోలీసులు మహిళ అదృశ్యం కేసు నమోదు చేసారు. పోలీసులు, ఆమె బంధువులు ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం లక్ష్మిదేవి బొందలకుంట శివారులో కొండలో శవమై కనిపించింది. ఘటనా స్థలంలో లభించిన ఆనవాళ్ళను బట్టి మృతదేహం లక్ష్మిదేవిదిగా గుర్తించారు. సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధిలో రాయచోటిని అగ్రగామిగా తీర్చిదిద్దుతా

• ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి
• 200 కుటుంబాలు పార్టీలో చేరిక



ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జిన్నా షరీఫ్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

రాయచోటి : రాయచోటిని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇప్పటికే వేలకోట్ల రూపాయలతో రాయచోటి పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిన్నా షరీఫ్ ఆధ్వర్యంలో 200 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి శ్రీకాంత్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి, అభివృద్ధి ఒకవైపు, అధర్మం, అన్యాయం ఒకవైపు ఉన్నాయన్నారు. ధర్మం వైపున నిలబడిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొంతమంది తనను వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని, వాటిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, జిన్నా సేవా సంస్థ అధ్యక్షుడు జిన్నా షరీఫ్, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ కో-ఆప్షన్ జాఫర్ అలీఖాన్, జడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, గాలివీడు మండల మైనార్టీ నాయకులు ఎస్‌కె ఖాదర్ మొహిద్దీన్, సంబేపల్లె నాయకులు వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు రియాజ్ రెహమాన్, గౌస్‌ఖాన్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ నవరంగ్ నిస్సార్, సాదిక్ అలీ, వాల్మీకి సంఘం అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, అంగూరు బ్రదర్స్, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, అన్నా సలీమ్, సుగవాసి శ్యామ్, జీఎండి ఇర్షాద్, జీఎండీ ఇమ్రాన్, దివాన్, ఆర్ట్స్ శంకర్, పొదలపల్లె గోపాల్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఓబులవారిపల్లె : గూడ్స్ రైలు కింద పడి పులి(55) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. కర్నూలు జిల్లాకు చెందిన పులి అనే వ్యక్తి ఓబులవారిపల్లె మండల కేంద్రంలో దాదాపు ఆరు సంవత్సరాలుగా వ్యవసాయ భూములలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం కడప నుండి రేణిగుంట వైపు వెళ్తున్న గూడ్స్ రైలు కింద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. తల, మొండెం వేరయ్యాయి. స్థానికులు రేణిగుంట జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తట్టివారిపల్లెకు చెందిన పెద్దన్న కుమారుడు విష్ణువర్ధన్(19) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల వెలువడిన పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయినట్లు తెలవడంతో సీటీఎం రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అదేవిధంగా చీకలబైలుకు చెందిన చంద్రా కుమారుడు శివశంకర్(30) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబసమస్యలతో బుధవారం వేంపల్లె పంచాయతీ మల్లయ్యకొండ సమీపంలో ఫ్లోరైడ్ గుళికల మందు తిని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం పట్టణంలో జరిగింది. దేవళంవీధికి చెందిన విష్ణువర్ధన్(17), ఫయాజ్(23) ద్విచక్ర వాహనాల్లో ఎదురెదురుగా వస్తూ సంతగేటు వద్ద ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికల ప్రచారంలో అంగన్ వాడీ కార్యకర్త హాజిర



ప్రచారంలో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా మైకు పట్టి మాట్లాడుతున్న అంగన్ వాడీ కార్యకర్త హాజిర

రాయచోటి : రాయచోటిలో టీడీపీ అభ్యర్థికి మద్దతుగా అంగన్ వాడీ కేంద్రంలో పనిచేసే కార్యకర్త హాజీర ప్రచారం చేసింది. బుధవారం రాయచోటి పట్టణంలోని బండ్లపెంట ప్రాంతంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిపై ఆమె విమర్శలు చేసింది. అంగన్ వాడీ కార్యకర్త చేస్తున్న ప్రచారం సోషల్ మీడియా, వాట్సప్‌లలో వైరల్ అవుతోంది. ఒకవైపు అధికారులు, సిబ్బంది ఇతర ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని చెబుతున్నా హాజీరా మాత్రం ప్రచారంలో పాల్గొనడమే కాకుండా మైకుచేత బూని టీడీపీకి ఓట్లు వేయాలని కోరడం విశేషం. స్థానికంగా ఉన్న ఓ యూట్యూబ్ వారు ఆమె చేత ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను సైతం ఆమె దూషించేలా వాయిస్ కూడా చేయించారు. కాగా ఆమె సాక్షి టీవీ విలేకరికి వాట్సప్ కాల్ చేసి నా వీడియోలు వేయాల్సిన అవసరం నీకే మొచ్చిందంటూ బెదిరింపులకు దిగింది.

తమ్ముడిని నాటు తుపాకీతో కాల్చిన అన్న

ప్రాణం మీదికి తెచ్చిన ఆస్తి వివాదం

వారిద్దరూ అన్నదమ్ములు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఆస్తి పంపకంలో పంతాలకు పోయారు. పేగు బంధాన్ని కాదని ఘర్షణకు దిగారు. పెద్ద మనసు చేసుకోవాల్సిన అన్న బాధ్యత మరచి తమ్ముడిపై దాడికి దిగాడు. కోపంలో నాటు తుపాకీ చేతబట్టి సోదరుడిపై కాల్పులకు తెగబడ్డాడు. తీవ్రగాయాలతో తమ్ముడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు.



నాటుతుపాకీతో కాల్చడంతో గాయపడిన విశ్వనాథ్

గుర్రంకొండ : ఆస్తి వివాదం పెద్దది కావడంతో తమ్ముడిని అన్న నాటు తుపాకీతో కాల్చిన సంఘటన మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ చాగలపల్లె దళితవాడలో జరిగింది. గ్రామానికి చెందిన బాలపోగు జయప్ప, బాలపోగు విశ్వనాథ్‌లు అన్నదమ్ములు. వీరికి గ్రామానికి సమీపంలోనే తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన పొలం ఉంది. గత కొంత కాలంగా ఆస్తి పంపకాలు, ఇతరత్రా విషయాలపై తరచూ అన్నదమ్ములు గొడవపడేవారు. ఇటీవల విశ్వనాథ్ ఇంటి ముందు ఉన్న టెంకాయ చెట్టును జయప్ప నరికి వేశాడు. ఈవిషయమై మంగళవారం రాత్రి విశ్వనాథ్ అన్న జయప్పను ప్రశ్నించాడు. తన ఇంటి ముందున్న చెట్టును ఎందుకు నరికి వేశావంటూ నిలదీయంతో వివాదం రాజుకొంది. పాత కక్షలు మనసులో పెట్టుకొని జయప్ప తమ్ముడు విశ్వనాథ్‌తో ఘర్షణకు దిగాడు. వివాదం పెద్దది కావడంతో అడవి జంతువులను వేటాడడం కోసం తన వద్ద దాచి ఉంచిన నాటు తుపాకీని తీసుకొచ్చి జయప్ప తన తమ్ముడు విశ్వనాథ్‌పై కాల్పులు జరిపాడు. ఈకాల్పుల్లో విశ్వనాథ్‌కు ఛాతీ, తొడలపై రక్త గాయాలు అయ్యాయి. గాయపడిన విశ్వనాథ్‌ను కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యసేవల కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

సబ్‌జైలులో రిమాండ్ ఖైదీ మృతి

• అనారోగ్యంతో మృతి చెందాడన్న పోలీసులు
• పోలీసులు కొట్టడంతోనే చనిపోయాడంటున్న కుటుంబసభ్యులు
• ఆస్పత్రి ఎదుట బాధితుల నిరసన



మరణించిన రిమాండ్ ఖైదీ మొగిలప్ప



మార్చురీ గది వెలుపల మొగిలప్ప కుటుంబ సభ్యులతో ఘటనపై విచారిస్తున్న ఆర్డీఓ

మదనపల్లె : సారా కేసులో అరెస్ట్ అయి, రిమాండ్‌లో భాగంగా మదనపల్లె సబ్‌జైలుకు తరలించిన ఖైదీ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పలమనేరు నియోజకవర్గం పంజాణి మండలం ముత్తుకూరు హరిజనవాడకు చెందిన జి.మొగిలప్ప(67) బుధవారం వేకువజామున తాను ఉన్న బ్యారక్‌లో కుప్పకూలి ఉండటంతో జైలు అధికారులు హుటాహుటిన 5.05 గంటల సమయంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడు రిమాండ్ ఖైదీ కావడంతో సబ్‌జైలర్ రామకృష్ణయాదవ్.. ఆర్డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, వన్‌టౌన్ సీఐ వలీబాషులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. వారితో పాటు మాలమహానాడు నాయకులు యమలా సుదర్శనం తదితరులు జిల్లా ఆస్పత్రికి చేరుకుని మొగిలప్ప మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు జరిపి, మొగిలప్ప ఆరోగ్యంగా ఉన్నాడని నిర్ధారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారని.. ఆ తర్వాత మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో సబ్‌జైలుకు తరలించిన మొగిలప్ప, తెల్లవారుజామున తీవ్ర అనారోగ్యానికి గురై మృతిచెందాడని జైలు అధికారులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. మొగిలప్ప మృతిపై మేజిస్ట్రీరియల్ విచారణ కోరుతూ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, వన్‌టౌన్ సీఐ వలీబాషులు మార్చురీకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భార్య రెడ్డెమ్మ మాట్లాడుతూ ఈ నెల 15వతేదీ సాయంత్రం సారాకేసులో తన భర్తను పెద్దపంజాణి పోలీసులు అరెస్ట్‌చేశారని, రిమాండ్‌కు పంపేందుకు రాత్రి కావడంతో ఉదయాన్నే 9 గంటలకు స్టేషన్‌కు తీసుకురావాల్సిందిగా చెప్పి పంపారంది. మరుసటిరోజు ఉదయం 11 గంటలకు భర్త మొగిలప్పతో కలిసి స్టేషన్‌కు వెళితే ఉదయం 9 గంటలకు రమ్మని చెబితే 11 గంటలకు వస్తారా అని ఎస్ఐ శ్రీనివాసులు తన భర్తను దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నట్లు చెప్పింది. తర్వాత తనను బయటకు వెళ్లమని చెప్పి, మొగిలప్పను స్టేషన్‌లోనే ఉంచుకుని, తర్వాత అతడితో పాటు మరొకరిని పలమనేరుకు వైద్యపరీక్షల నిమిత్తం తీసుకెళ్లారంది. తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని, బుధవారం వేకువజామున మదనపల్లె సబ్‌జైలు నుంచి మొగిలప్పకు సీరియస్‌గా ఉందని, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళుతున్నామని, అత్యవసరంగా రావాల్సిందిగా సమాచారం ఇచ్చారని.. తాను మదనపల్లెకు బయలుదేరేలోపు భర్త చనిపోయాడని చెప్పారంది. ఆరోగ్యంగా ఉన్న తన భర్తను పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులు చిత్రహింసలకు గురిచేసి, కొట్టి చంపేశారని భార్య రెడ్డెమ్మ ఆరోపిస్తూ కన్నీరుమున్నీరైంది. తనకు న్యాయం చేయాలని ఆర్డీఓ హరిప్రసాద్‌ను కోరింది. రిమాండ్ ఖైదీ మృతిపై సబ్‌జైలర్ రామకృష్ణయాదవ్ ఫిర్యాదు మేరకు ఆర్డీఓ హరిప్రసాద్ పోస్టుమార్టం ప్రక్రియను వీడియో తీయాల్సిందిగా ఆదేశించి, మృతదేహంపై తాను గుర్తించిన అంశాలతో నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు. రిమాండ్ ఖైదీ మృతిపై సబ్‌జైలర్ రామకృష్ణయాదవ్ వివరణ ఇస్తూ మొగిలప్ప తెల్లవారుజామున గుండెలో నొప్పిగా ఉందని, శ్వాస తీసుకునేందుకు ఇబ్బందిపడుతూ బ్యారక్‌లో కుప్పకూలిపోవడంతో వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారన్నారు.